## క్లుప్తంగా

### అగ్రిల్యాబ్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు



**ప్రత్తిపాడు:** అగ్రిల్యాబ్ ద్వారా రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి, ల్యాబ్ ఇన్‌చార్జి కె.అరుణకుమారి తెలిపారు. ప్రత్తిపాడులోని అగ్రి ల్యాబ్‌కు ఇన్‌చార్జిలే దిక్కయ్యారని.. ఏవోలు చేయాల్సిన పరీక్షలు కూడా ఏఈవోలే చేస్తున్నారని.. ఇన్‌చార్జిగా ఉన్న ఏవోలు కూడా ల్యాబ్‌కు చుట్టం చూపుగా వస్తున్నారంటూ ఈ నెల 28న 'సాక్షి'లో 'అగ్రిల్యాబ్‌పై చిన్న చూపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏవో అరుణకుమారి శుక్రవారం ల్యాబ్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు చేసిన పరీక్షలు, అందిన శాంపిల్స్, సిబ్బంది హాజరు వంటి విషయాలను పరిశీలించారు. అనంతరం ల్యాబ్‌లోని ఆయా రకాల రిజిష్టర్లను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

### బిల్లులు జమయ్యేలా చర్యలు తీసుకుంటాం

సాక్షి ఎఫెక్ట్..

**ప్రత్తిపాడు:** మినీ గోకులాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు వారి ఖాతాలకు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధక శాఖ ఏడీఏ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. మినీ గోకులాల లబ్ధిదారులకు బిల్లులందంక ఇబ్బందులు పడుతున్నారంటూ ఈనెల 30వ తేదీన 'సాక్షి'లో 'మినీ గోకులాలు.. బిల్లులకు ఎదురు చూపులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆ శాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల ఉపాధి హామీ ఏపీవోతో పాటు ఎంపీడీవోలను కలిసి బిల్లులు సాధ్యమైనంత త్వరగా వారికి అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ఉరి వేసుకుని వ్యక్తి మృతి

**చేబ్రోలు:** స్పిన్నింగ్ మిల్‌లో పనిచేస్తున్న వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చేబ్రోలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన చేబ్రోలు ఎన్ఆర్‌కే స్పిన్నింగ్ మిల్‌లో రవి కుమార్(45) అనే వ్యక్తి 10 ఏళ్లుగా పనిచేస్తూ అక్కడే నిర్మించిన క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. క్వార్టర్స్‌లో ఆయన ఉరి వేసుకుని చనిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకటకృష్ణ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. అదే స్పిన్నింగ్ మిల్‌లో పనిచేసే రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### పెదకాకానిలో గాలివాన బీభత్సం



**పెదకాకాని:** పెదకాకాని మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు చోటు చేసుకుని రాత్రి 7:30 గంటలకు భారీ వర్షం కురిసింది. వర్షానికి తోడుగా గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వర్షం పూర్తిగా తగ్గిన తరువాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పెదకాకాని సెంటర్ నుంచి వెనిగండ్ల వైపు వెళ్లే రోడ్డు వర్షం నీరుతో నిండిపోయింది. పెదకాకాని కెనరా బ్యాంక్ నుంచి పాత పోలీసు స్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై వర్షం నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

### సీపీఎం నేత పుతుంబాక చిరస్మరణీయుడు

**లక్ష్మీపురం:** దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణ కోసం అమరజీవి పుతుంబాక వెంకటపతి స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సీపీఎం నేత పుతుంబాక వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై.నేతాజీ మాట్లాడుతూ వెంకటపతి రైతాంగ సమస్యలపై ప్రత్యేకమైన అధ్యయనం, పరిశీలన చేసేవారని గుర్తు చేశారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర నాయకునిగా ఎదిగారని తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు మాట్లాడుతూ ప్రధానంగా నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంత సమస్యలు, రైతాంగానికి గిట్టుబాటు ధరల సమస్యలపై నిరంతరం కృషి చేశారన్నారు. భూమి కోసం, భుక్తికోసం, పేదల విముక్తి కోసం జరిగిన ఉద్యమానికి అనేక విధాలుగా సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు బి.లక్ష్మణరావు, ఎం.ఎ.చిష్టీ, బి.ముత్యాలరావు, వై.కృష్ణకాంత్, బెర్రగాని శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, కె.పద్మ, ఎస్.పద్మ, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీలో సమస్యల తిష్ట!

- అధ్వానంగా రోడ్లు.. వెలగని వీధిలైట్లు
- పెరిగిపోతున్న పిచ్చి మొక్కలు
- సమస్యల్లో నిడుబ్రోలు జగనన్న కాలనీ



అధ్వానంగా కాలనీ ప్రధాన రహదారి

**పొన్నూరు:** గత వైఎస్సార్‌సీపీ హయాంలో పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా నిడుబ్రోలులో జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. పేదలకు స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస మౌలిక వసతులు లేక కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి సమస్యలు ఎదుర్కొంటున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు.

**కనీస సౌకర్యాలు కరువు..**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిడుబ్రోలులో వైఎస్సార్‌సీపీ జగనన్న కాలనీ పేరుతో రూ.84.33 కోట్లతో 4,685 ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. శరవేగంగా భూమిని అభివృద్ధి చేసి రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన సౌకర్యాలు అందించడంతో సుమారు 70 మంది వరకు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలనీ అభివృద్ధిని విస్మరించింది. స్థానికులకు కావాల్సిన కనీస వసతుల ఏర్పాటును పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. దీంతో పిచ్చి చెట్లతో నిండిన రహదారులు అధ్వానంగా మారాయి. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నిల్వ చేరి దుర్గంధం వస్తోంది. వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలగడంలేదు. ఇలా అయితే కాలనీలో జీవనం సాగించేదెలా అని స్థానికులు వాపోతున్నారు.

**అధ్వానంగా రహదారులు..**

కాలనీలో ప్రధాన రహదారి గుంతలమయమైంది.



ప్రయాణానికి అనువుగా లేని లింకు రోడ్డు

లింకురోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నడిరోడ్డుపై చెట్లు, రాళ్లు చేరడంతో ప్రయాణానికి ఇబ్బందులు తప్పడం లేదంటూ కాలనీ వాసులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో ఈ రోడ్లపై వెళ్లేందుకు స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నీ మట్టి రోడ్లే కావడంతో వర్షం పడితే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఆ రోడ్లపై నడిచి వెళ్లే అవకాశం కూడా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

**దొంగల బెడద ఎక్కువైంది..**



ప్రధాన రహదారిలో గుంతల కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో అందరం కలిసి కొంత నగదు సేకరించి రోడ్డును అభివృద్ధి చేసుకున్నాం. భారీ వాహనాలు వస్తుండటంతో రోడ్డు అధ్వానంగా మారింది. కాలనీలో వీధి లైట్లు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో దొంగల బెడద కూడా ఎక్కువైంది. అధికారులు సమస్యలను పరిష్కరించాలి.

– గౌస్ బాషా, స్థానికుడు

## బహిరంగంగా బెల్టు దుకాణం!



బెల్టు దుకాణాల రూపం మారింది. ఒకప్పుడు బెల్టు దుకాణాలంటే గుట్టుచప్పుడు కాకుండా ఎక్కడో ఓ మూలన నలుగురి కంట్లో పడకుండా నడిచేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో హంగూ ఆర్భాటాలతో రోడ్లు వెంబడి పెద్ద పెద్ద అంగళ్లలాగా దర్జాగా పుట్టుకొస్తున్నాయి. దుకాణం బయటకు కనిపించకుండా ఉండేందుకు చుట్టూ పచ్చని క్లాత్‌లు కట్టి మద్యం విక్రయిస్తున్నారు. మద్యం గ్లాసులు, మంచింగ్ పెట్టుకోవడానికి మధ్యలో అక్కడక్కడా అరుగుల తరహాలో ఏర్పాటు చేసి యథేచ్ఛగా బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇదెక్కడో మారు మూల గ్రామం అనుకుంటారేమో.. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోనే. ప్రత్తిపాడు నుంచి పాతమల్లాయపాలెం వెళ్లే రోడ్డులో సువిశాల బెల్టు దుకాణం ఇలా దర్శనమిస్తోంది.

– ప్రత్తిపాడు

## రేపు రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**నెహ్రూనగర్:** గుంటూరు నగరంపాలెంలోని ఎస్‌వీఎస్ఆర్ రెడ్డి బాయ్స్ హాస్టల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేసినట్లు రెడ్డి హాస్టల్ మేనేజర్ జంగా సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1977 నుంచి 2024 వరకు హాస్టల్‌లో చదువుకున్న వారంతా ఈ సమ్మేళనానికి హాజరవుతున్నట్లు చెప్పారు.

## పీఠభూములపై అవగాహన

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థిని వి.వెంకటకృష్ణ భారతదేశంలో పీఠభూములపై తరగతులు నిర్వహించారు. పీఠభూములు, నదులు వాటి ప్రాముఖ్యత, జన్మస్థానం తదితర అంశాలను వివరించారు. కరోనా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

## క్రీడలతో విస్తృత అవకాశాలు

మేయర్ కోవెలమూడి రవీంద్ర



మాట్లాడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

**గుంటూరు ఎడ్యుకేషన్:** క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం అలవడుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో యద్ల రాజ్యలక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పురుషుల బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉంటున్నారని, అటువంటి వారికి క్రీడలపై ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. క్రీడలు మానసిక స్థైర్యంతో పాటు భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నతంగా, ధైర్యంగా నిలబడే విధంగా దోహదం చేస్తాయన్నారు. హిందూ కళాశాలలో వ్యాయామ అధ్యాపకురాలిగా పని చేసిన యద్ల రాజ్యలక్ష్మి స్మారకార్థం ఆమె విద్యార్థులు, కుటుంబ సభ్యులు కలిసి టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జూన్ ఒకటో తేదీ వరకు జరగనున్న పోటీల్లో క్రీడాకారులు నైపుణ్యాన్ని కనబర్చి, విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, రాహుల్ చౌదరి, రత్న దివ్యాస్, గింజుపల్లి వరప్రసాదరావు, హెచ్ ఫౌండేషన్ సభ్యులు వెంకటేష్, నారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

## టీసీఎస్‌లో ఉద్యోగాలకు 27 మంది ఎంపిక




**గుంటూరు ఎడ్యుకేషన్:** జేకేసీ కళాశాలలో శుక్రవారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 27 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అధికారి డాక్టర్ యలవర్తి సురేష్‌బాబు తెలిపారు. టీసీఎస్ సంస్థ వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.గోపీచంద్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు విద్యార్థులను అభినందించారు.

## బెదిరింపులకు దిగితే ఆందోళన ఉద్ధృతం చేస్తాం



పట్టాభిపురం పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న గిగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

**లక్ష్మీపురం:** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న జొమాటో గిగ్ వర్కర్స్‌పై బెదిరింపులకు పాల్పడి, అక్రమ కేసులు పెడతామంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని గిగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు సోగా బ్రహ్మయ్య, యూనియన్ గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు హెచ్చరించారు. జొమాటో గిగ్ వర్కర్స్ రెండు రోజులుగా తగ్గించినటువంటి పే అవుట్లు పెంచాలని, ఇన్సెంటివులు గతంలో మాదిరిగా ఇవ్వాలని కోరుతూ నిరసన తెలిపారు. అనంతరం వికలాంగుడు అని కూడా చూడకుండా దాడికి పాల్పడిన యాజమాన్యం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం డెప్యూటీ లేబర్ కమిషనర్‌కు తమ సమస్యలు తెలియజేస్తూ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమం జొమాటో గిగ్ వర్కర్స్ నాయకులు రణధీర్, శశికుమార్, వెంకట్, నరసింహారావు, వాల్మీకి పాల్గొన్నారు.

## భార్యాభర్తలపై దాడి

**నగరంపాలెం:** బాకీ అడిగిన భార్యాభర్తలపై దాడికి పాల్పడ్డారు. వివరాలు.. రామిరెడ్డితోట ఐదో వీధిలో పర్వేందర్‌సింగ్ మెకానిక్ దుకాణం నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల అదే ప్రాంతానికి చెందిన సంధ్య, స్కూటీని మరమ్మతుల దృష్ట్యా మెకానిక్ దుకాణానికి తీసుకొచ్చారు. రూ.1,500 ఇవ్వాలని కోరగా ఆమె రూ.500 చెల్లించారు. మిగతా రూ.1,000 చెల్లించాలని పలుమార్లు అడిగినా ఆమె చెల్లించలేదు. రెండు రోజుల క్రితం పర్వేందర్‌సింగ్, భార్యతో కలసి ఆమె ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు అడిగారు. సంధ్యతో పాటు మరికొందరు ఏకమై వారిపై దాడికి పాల్పడ్డారు. మెకానిక్ శుక్రవారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

## హక్కులు కాపాడుకునేందుకు పోరాటం



సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

**లక్ష్మీపురం:** ఐక్యత– పోరాటం నినాదంతో సీఐటీయూ ఆవిర్భవించిందని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుంటూరు శ్రీనివాసరావుపేటలోని మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్‌లో జెండాను ఆవిష్కరించారు. ముత్యాలరావు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ ను తీసుకు వచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికులు పెట్టుబడిదారుల బానిసలుగా మారిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జూలై 9న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ 4 లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, కార్మికుల సామాజిక భద్రత హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుంటూరు మల్లికార్జునరావు, చల్లాపల్లి కిన్నెర్, బాలకృష్ణ, మణి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం శీతకన్ను



**నెహ్రూనగర్:** దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తూ చిన్న చూపు చూస్తోందని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ(డీజేఏసీ) జాతీయ చైర్మన్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన వాటాలను, నిధులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్లమెంట్ స్థానాల పునర్విభజన పేరుతో వంద సీట్లకే దక్షిణాది రాష్ట్రాలను పరిమితం చేసేందుకు కేంద్రం కుయుక్తులు పన్నుతుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంతో పాటు హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీజేఏసీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కైలా జయసుధను నియమించారు. ముందుగా డీజేఏసీకి సంబంధించిన డిమాండ్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమణయ్య, సాంబశివరావు, వాసు, శ్రీనివాసరావు, ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మండిపాటు

**ప్రత్తిపాడు:** మా మండలంలో విద్యుత్ శాఖ అట్టర్ ఫ్లాప్ అని.. ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని వైస్ ఎంపీపీ కె.సాంబశివరావు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండల కేంద్రం పెదనందిపాడులో శుక్రవారం ఎంపీపీ హెప్సిబా అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత కొద్ది రోజులుగా పెదనందిపాడు మండలంలో విద్యుత్ కోతలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశంలో వైస్ ఎంపీపీ విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. గ్రామాల్లో రాత్రి పూట కరెంటు పోతే సమాధానం చెప్పేవారు కరువయ్యారని.. ఆ శాఖ సిబ్బందికి ఫోన్లు చేస్తే కాలయాపన సమాధానాలు వస్తున్నాయని సాంబశివరావు మండిపడ్డారు. స్పందించిన ఇన్‌చార్జి ఏఈ మాట్లాడుతూ.. మండలం మొత్తం మీద 5 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయని.. అవన్నీ పరిశీలించి స్పందించడంలో ఆలస్యం అవుతోందని అన్నారు. ఇకపై సమస్యలు పునరావృతం కాకుండా చూస్తామని అన్నారు.

## డ్వామా అధికారుల విచారణ



విచారణ నిర్వహిస్తున్న డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ హనుమంతరావు

**ప్రత్తిపాడు:** మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ సి.హనుమంతరావు విచారణ నిర్వహించారు. గ్రామంలో గత కొన్నేళ్లుగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నల్లపు ఏసుబాబు మస్టర్లలో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ గతేడాది గ్రామానికి చెందిన కొందరు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డ్వామా ఏపీడీ, విజిలెన్స్ ఆఫీసర్ హనుమంతరావు స్థానిక సచివాలయంలో విచారణ చేపట్టారు. కొందరు గ్రామస్తులతో మాట్లాడారు. వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో విచారణ నిర్వహించామన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేశారని.. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నామని అన్నారు. ఏపీవో ఎస్.ఏడుకొండలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## సిబార్‌లో ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్ శిబిరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రాయపాటి శైలజ

**పెదకాకాని:** మహిళలందరూ గర్భాశయ క్యాన్సర్ నివారణకు తప్పక వ్యాక్సిన్ తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. పెదకాకాని మండలంలోని సిబార్ దంత వైద్య కళాశాలలో శుక్రవారం గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ.. సిబార్ దంత వైద్య కళాశాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రైవేట్ సంస్థల్లో కూడా ఇటువంటి సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముందుగా డాక్టర్ నవీన గర్భాశయ క్యాన్సర్ కారకాలు, నివారణలో వ్యాక్సిన్ పాత్రను వివరించారు. చివరిగా కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. జాతీయ దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిబార్ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## 2న ఇళ్ల స్థలాల సాధన కోసం ధర్నా



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

**పొన్నూరు:** పేదలు ఇళ్ల స్థలాలను సాధించుకునేందుకు జూన్ 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ధర్నాకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో పేదలకు 2, గ్రామాల్లో 3 సెంట్ల భూమి ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేసి, విడుదల చేసిన జీవో ప్రకారం అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి షేక్. గౌస్, కె.రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

**పొన్నూరు:** మండలం, పట్టణ పరిధిలో కార్డుదారులకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపులలోనే రేషన్, సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ డీలర్లకు సూచించారు. రూరల్ పరిధిలో 45 రేషన్ దుకాణాలు, పట్టణ పరిధిలోని 23 దుకాణాలలో 15వ తేదీ వరకు పంపిణీ ఉంటుందన్నారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. మండల, పట్టణ పరిధిలో మొత్తం 35,029 కార్డులు ఉండగా రూరల్ పరిధిలో 20,216.. పట్టణ పరిధిలో 14,813 కార్డులు ఉన్నాయని అన్నారు. కార్డుదారులు అందరికీ సరుకులు అందించాలని తెలిపారు. రేషన్ షాప్ డీలర్లు పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రత్తిపాడు:** రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చౌక ధరల దుకాణ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 1 నుంచి 15 రోజుల పాటు డీలర్లు కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ డీలర్లు దుకాణాల వద్ద స్టాక్ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీఎస్ డీటీ శివశంకర్, రేషన్ డీలర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

**చేబ్రోలు:** రేషన్ షాపుల ద్వారా ఆదివారం నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసశర్మ ఆదేశాలు జారీ చేశారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ అధ్యక్షతన రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు షాపుల వద్దనే సరుకులు పంపిణీ చేయాలని అన్నారు. అందుకు తగిన ఏర్పాట్లను షాపుల వద్ద చేయాలని డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## తెనాలి పోలీసులను విధుల నుంచి తొలగించాలి

**పొన్నూరు:** తెనాలిలో దళిత, మైనార్టీ యువకులను అత్యంత దారుణంగా హింసించిన పోలీసులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని, వారిని విధుల నుంచి తొలగించాలని మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జియస్ రాయల్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయంలో రాయల్ మాట్లాడుతూ.. యువకులకు న్యాయం చేయాలని కోరుతూ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని అన్నారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమాటి రాజారావు, కేఎన్‌పీఎస్ సభ్యుడు తోడేటి శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు. తెనాలి ఘటనలో బాధితులకు సంఘీభావంగా పొన్నూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్.బాజీ సాహెబ్, న్యాయవాదులు అంకమ్మరావు, బి.రాజారావు, గండు శ్రీనివాసరావు, నక్క కృష్ణ, పిల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.